క్లుప్తంగా

సీహెచ్‌సీ తనిఖీ


వైద్యులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలు అందివ్వాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం స్థానిక సీహెచ్‌సీని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. అడ్మిట్ అయిన రోగులు, ఓపీకి వచ్చిన వారితో ఆయన ఆస్పత్రి సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆస్పత్రిలోని ఓపీ రిజిస్టర్, సిబ్బందిని, అందుతున్న సేవలను పరిశీలించారు. అనంతరం వైద్యులతో మాట్లాడారు. ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రిపై నమ్మకం పెరిగేలా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దారుగా జయప్రకాశ్



సదుం: తహసీల్దారుగా జయప్రకాశ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కుప్పం ఆర్డీఓ కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న హుస్సేన్ గతంలో ఏసీబీ అధికారులకు పట్టుబడటం విదితమే. బాధ్యతల స్వీకరణ అనంతరం తహసీల్దార్ వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. విధులు పారదర్శకంగా నిర్వహించాలని, ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

లయన్స్ క్లబ్ అన్నదానం


అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

వి.కోట: లయన్స్‌క్లబ్ సభ్యులు శుక్రవారం దాదాపు 500 మంది పేదలకు అన్నదానం చేశారు. సంస్థ సభ్యుల జన్మదినం పురస్కరించుకుని ప్రతి నెలా 15వ తేదీ పట్టణంలోని కేజీఎఫ్ బస్టాండు వద్ద ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. కార్యక్రమంలో వి.కోట క్లబ్ అధ్యక్షుడు ధీరజ్, సభ్యులు డాక్టర్ తమీమ్, ఇంద్రేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శిరస్సు ఊరేగింపునకు అనుమతి ప్లీజ్!


రైల్వే అధికారికి వినతిపత్రం ఇస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కుప్పం: కుప్పం గ్రామదేవత శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ శిరస్సు ఊరేగింపులో భాగంగా రైల్వే పట్టాలపై వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని రైల్వే ఉన్నతాధికారి మహబూబ్‌బాషాను ఆలయ కమిటీ సభ్యులు గురువారం కోరారు. శిరస్సు ఊరేగింపు ప్రాముఖ్యతను ఆయనకు వివరించారు. అమ్మవారి శిరస్సు కొత్తపేటకు వెళ్లాలంటే రైల్వే పట్టాల మీదుగా వెళ్లడానికి కొంత భాగం రైల్వే గోడను కూల్చి వేయాల్సి వస్తుందని, ఊరేగింపు అనంతరం పునర్నిర్మాణం చేస్తామని ఆయనకు తెలిపారు. ప్రతి ఏటా ఇలాగే గోడను తొలగించి 20వ తేదీ శిరస్సు కొత్తపేటలో ఊరేగింపు అనంతరం మరుసటి రోజు యథాతథంగా గోడను నిర్మించే బాధ్యత ఆలయ కమిటీ తీసుకుంటుందని విజ్ఞప్తి చేశారు.

క్రీడలతో ఉత్సాహం, స్ఫూర్తి


వార్షిక క్రీడల సంబరాల్లో వైద్య విద్యార్థులు

గుడుపల్లె: వైద్య విద్యార్థులకు చదివే సమయంలో క్రీడలతో ఉత్సాహం, మరింత స్ఫూర్తి పొందాలని పీఈఎస్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హెచ్ఆర్ క్రిష్ణారావు అన్నారు. గురువారం పీఈఎస్ క్రీడా మైదానంలో వార్షిక క్రీడలు, సాంస్కృతిక ఉత్సవం, సింధూర్–25 ప్రారంభోత్సవ సంబరాలు నిర్వహించారు. వారం పాటు నిర్వహించే ఈ కార్యక్రమాలు వైద్య విద్యార్థులు తమ ప్రతిభను చాటుకునేందుకు, ఏకత్వం, నాయకత్వం సృజనాత్మకత నైపుణ్యాలు పెంపునకు ఇవి దోహదపడుతాయన్నారు. చదువుతో పాటు క్రీడలు కూడా ఒక భాగమేనన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక వికాసం

–జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

యాదమరి: క్రీడలు విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి దోహదం చేస్తాయని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ సత్తా చాటాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. గురువారం మండలంలోని పీఈఎస్ పబ్లిక్ పాఠశాలలో పదవ సబ్ జూనియర్స్ ఇంటర్ డిస్ట్రిక్ చాంపియన్‌షిప్ బాస్కెట్ బాల్ పోటీలను జిల్లా కలెక్టర్, పూతలపట్టు ఎమ్మెల్యే కె.మురళీ మోహన్, డీఎఫ్ఓ భరణి ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో ఆడాలన్నారు. ఈ పోటీలు నాలుగు రోజులపాటు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

‘గంగ’రంగ వైభవంగా..!

- అట్టహాసంగా శిరస్సు మెరవణి
- అమ్మవారి విశ్వరూప దర్శనానికి పోటెత్తిన భక్తజనం
- పలమనేరు వీధుల్లో లక్షల్లో పగిలిన కొబ్బరికాయలు
- అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే అమర్, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ


అమ్మవారి సేవలో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ


అమ్మవారి శిరస్సు మెరవణి

పలమనేరు: పలమనేరులో ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే తిరుపతి గంగమ్మ జాతర గురువారం అంగరంగ వైభవంగా సాగింది. దేదీప్యమైన కాంతులతో అమ్మవారు గురువారం తెల్లవారుజాము నుంచి గంగమ్మ తోపులో భక్తుల దర్శనార్థం కొలువుదీరారు. శిరస్సు మెరవణి తర్వాత అమ్మవారిని విశ్వ రూపదర్శనానికి ఉంచారు. తెల్లవారుజాముున నుంచి రాత్రి వరకు పలమనేరు పట్టణ ప్రజలే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు, పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటకకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. పట్టణంలోని ముఖ్య వీధులన్నీ భక్తులతో కిటకిటలాడాయి.

భక్తిశ్రద్ధలతో శిరస్సు ఊరేగింపు

బుధవారం అర్ధరాత్రి పాతపేటలోని వేణుగోపాల స్వామి ఆలయం నుంచి అమ్మవారి బంగారు శిరస్సు ప్రారంభమైన ఊరేగింపు మంగళ వాయిద్యాల నడుమ టీకే స్ట్రీట్, నేషనల్ హైవే, జవిళివీధి, బజారువీధుల మీదుగా సాగింది. ఇంటింటా టెంకాయలు కొట్టి కర్పూర నీరాజనాలు సమర్పించారు. మరో వైపు మొక్కులు ఉన్న భక్తులు 101 టెంకాయలనూ కొట్టారు. పట్టణంలోని వీధులన్నీ టెంకాయ నీటితో తడిసిపోయాయి. ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, పట్టణంలోని పలుచోట్ల ఏర్పాటు చేసిన విద్యుద్దీపాల అలంకరణ, కీలుగుర్రాలు, పాటకచేరి, బళ్లారి డ్రమ్స్, చెక్క భజనలు, కోలాటలు, పిల్లనగ్రోవులు, బుట్ట బొమ్మలు, పండరి భజనలు..మొదలైనవి భక్తులను ఆకట్టుకున్నాయి.

భారీగా జంతుబలులు

అమ్మవారి శిరస్సు ఊరేగింపు సందర్భంగా పట్టణంలో వేల సంఖ్యలో పొట్టేళ్లు, వందలాది మేకపోతులను అమ్మవారికి బలిచ్చారు. మరోవైపు పట్టణంలోని చికెన్ సెంటర్లు, మటన్ స్టాళ్లు కిటకిటలాడాయి. ఇక మద్యం షాపులు, బెల్ట్‌షాపులు మందుబాబుల సందడితో కిక్కెక్కితూలాయి.

గట్టి బందోబస్తు

ఈ పర్యాయం జాతరలో దొంగల బెడద దగ్గింది. ఎప్పటికప్పుడు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. మరోవైపు మందుబాబుల గోల ఎక్కువ కనిపించింది. అయితే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు పటిష్ఠ చర్యలు తీసుకున్నారు. సీసీ కెమెరాలు, డ్రోన్ల నిఘా నడుమ జాతర సాగింది. పలమనేరు డీఎస్పీ డేగల ప్రభాకర్, సీఐ నరసింహరాజుల ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

పట్టణంలో జాతర కోలాహలం

పట్టణానికి చెందిన పీపీఎస్ నిర్వాహకులు భక్తులకు మజ్జిగ, స్థానిక యోగివేమన రెడ్డి సంఘం నిర్వాహకులు బిర్యానీ, పలుచోట్ల స్వచ్ఛంద సంస్థలు, కుల సంఘాల నాయకులు పానకం, మజ్జిగను పంపిణీ చేశారు. పలు ఆలయాల వద్ద అన్నదానం చేశారు. ఇక విచిత్ర వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పట్టణం కోలాహలంగా కనిపించింది.

భక్తులతో పోటెత్తిన ఆలయాలు

పట్టణంలోని పలు ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. ముఖ్యంగా మారెమ్మ ఆలయం వద్ద వేల సంఖ్యలో భక్తులు మొక్కులు చెల్లించారు. ఆలయం ఎదుట పొంగళ్లు పెట్టారు. పట్టణంలోని ప్రధాన ఆలయాలైన సత్యగంగమ్మ, ఆరిమాను గంగమ్మ, ఓంశక్తి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మారెమ్మ ఆలయం వద్ద ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి దంపతులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం అక్కడ అన్నదాన కార్యక్రమాన్ని రేణుకారెడ్డి ప్రారంభించారు.

కావాల్సిన వారికే వీఐపీ పాసులు

గతంలో వలే కాకుండా ఈ పర్యాయం కావాల్సిన వారికి మాత్రమే వీఐపీ పాసులను ఇచ్చారు. ఫలితంగా సర్వ దర్శనం ద్వారానే ఎక్కువ మంది అమ్మవారిని దర్శించుకున్నారు. కూటమి నేతలు కొందరు పాసులను ఎక్కువగా పొంది సామాన్య భక్తులకు ఇబ్బంది కలిగించారు.


అమ్మవారి సేవలో ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి దంపతులు


అమ్మవారి ఆలయం ముందు చేస్తున్న అన్నదానం

అమ్మవారి సేవలో..

ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, సూపర్‌బజార్ మాజీ అధ్యక్షులు సుభాష్ చంద్రబోస్, మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నేతలు మొగసాల క్రిష్ణమూర్తి, మురళీకృష్ణ, దయానందగౌడ, చెంగారెడ్డి, ప్రహ్లాద, నరేష్, రహీంఖాన్, పార్టీ పట్టణ కన్వీనర్ హేమంత్‌కుమార్‌రెడ్డి, పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే సునీల్, మున్సిపల్ కౌన్సిలర్లు, పలువురు వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులు, పట్టణ ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

నేడు నిమజ్జనంతో జాతర పరిసమాప్తం

గంగమ్మ జాతర శుక్రవారం జలధితో ముగియనుంది. ఉదయం 5 గంటలకు అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లి గాంధీనగర్ సమీపంలోని బావిలో నిమజ్జనం చేస్తారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను మున్సిపల్ అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు.

నోటీస్ బోర్డు

- అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె, వి.కోట మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని సీడీపీఓ అరుణశ్రీ కోరారు. బైరెడ్డిపల్లె మండలంలోని రఘునాయకులదిన్నె (ఏడబ్ల్యూహెచ్–ఎస్టీ) వి.కోట మండలంలోని గాండ్లపల్లె, పాపేపల్లె (జనరల్)అంగన్‌వాడీ కేంద్రాల్లో సహాయకురాలు పోస్టులు ఖాళీగా ఉన్నాయని, స్థానిక వివాహితులు 10వ తరగతి పాస్ అయిన వారు ఈనెల 16 నుంచి 24వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

జంతుబలులకు పోలీస్ గుర్తింపు కార్డులు!

- ఆధార్ కార్డు, ఫొటోలతో వస్తే పర్మిషన్: డీఎస్పీ

కుప్పం: శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా జంతుబలులు సమర్పించేవారు తప్పనిసరిగా పోలీసుల నుంచి గుర్తింపు కార్డులు పొందాలని డీఎస్పీ పార్థసారథి గురువారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. శిరస్సు ఊరేగింపులో సాంప్రదాయంగా జంతు బలులు ఎవరుబడితే వారు చేయరాదని, జంతు బలుల మొక్కులు ఉన్నవారు ఆధార్ కార్డు తీసుకుని వచ్చి తమ వద్ద గుర్తింపు కార్డు పొందాలని తెలియజేశారు. మద్యం సేవించడం, క్రిమినల్ కేసులు ఉన్న వారికి గుర్తింపు కార్డులు ఇవ్వమని, 17వ తేదీ లోపు ఆధార్ కార్డులు, ఫొటోలతో సంప్రదించి కార్డులు పొందాలన్నారు.

గాలివాన బీభత్సం

పిడుగు పడి ట్రాన్స్‌ఫార్మర్ ఔట్



పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల మండలంలో గురువారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. వర్షానికి భారీగా మామిడి కాయలు నేలరాలాయి. దీనితో పాటు చెట్లు విరిగిపడ్డాయి. అరటి చెట్లు నేలకొరిగాయి. పులిచెర్లలో రమణారెడ్డి ఇంటి సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్‌పై పిడుగుపడి కాలిపోయింది. కోతకు వచ్చిన మామిడి కాయలు నేల రాలడంతో రైతులకు నష్టం వాటిల్లింది.

భక్తి ప్రపత్తులతో అర్జున తపస్మాన్


తపస్మాన్ అధిరోహిస్తున్న అర్జున వేషధారి

గుడుపల్లె: మండలంలో యామగానిపల్లెలోని శ్రీ ద్రౌపదీ ధర్మరాజుల మహా భారత ఉత్సవాల్లో 14వ రోజు గురువారం ద్రౌపది అమ్మవారి పుష్పపల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. తొలుత ఉదయం ఆలయం వద్ద అర్జున తపస్మాన్ కార్యక్రమాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. కౌరవులతో యుద్ధంలో గెలవడానికి అర్జునుడు శివుని నుంచి పాశుపతాస్త్రం శివుని పొందడానికి తపస్మాన్ అధిరోహిస్తాడని భారతగాథ. బుధవారం రాత్రి అరణ్యపర్వం నాటక ప్రదర్శన అనంతరం ఉదయాన అర్జున వేషధారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన అనంతరం తపస్సు మానుకు ప్రత్యేక పూజలు చేసి, నిమ్మకాయలు, పూజాసామగ్రిని తీసుకుని అధిరోహించాడు. అక్కడ నుంచి విసిరిన నిమ్మకాయలు, విభూది ఉండలు, ఇతరత్రా వాటిని దక్కించుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు ఆ తర్వాత మొక్కులు చెల్లించారు. అనంతరం రాత్రి ఆలయంలో ద్రౌపదమ్మను ప్రత్యేకంగా అలంకరించి పుష్పపల్లకిలో మంగళవాయిద్యాలు, బాణ సంచా మోత నడుమ ఆలయం చుట్టూ ఊరేగించారు. ఆ తర్వాత శ్రీకృష్ణార్జునుని యుద్ధం పౌరాణిక నాటకం ప్రదర్శించారు. భక్తులకు అన్నదానం చేశారు.

బోరు, ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం


బోరును ప్రారంభిస్తున్న ఎంపీపీ

వి.కోట: తాము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కులమతాలు, పార్టీలకతీతంగా సేవలందిస్తున్నామని ఎంపీపీ యువరాజు అన్నారు. గురువారం మండలంలోని చింతమాకులపల్లె పంచాయతీ కుదవగడ్డలో తాగునీటి సమస్యను గ్రామస్తులు ఆయన దృష్టికి తేవడంతో స్పందించారు. నూతన బోరు, మోటారు మంజూరు చేయించారు. బోరులో నీళ్లు పుష్కలంగా పడ్డాయి. గురువారం ఆ బోరు మోటారును, అలాగే పంచాయతీ నుంచి కొత్తగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను పూజలు చేసి ఎంపీపీ ప్రారంభించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ గోపిరెడ్డి, సర్పంచ్ రామచంద్రప్ప, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థలకు నిధులు కేటాయించరూ!


ఆర్థిక సంఘ సభ్యులకు వినతిపత్రం ఇస్తున్న చిత్తూరు మేయర్

చిత్తూరు అర్బన్: చిత్తూరు కార్పొరేషన్‌లో అంతంతమాత్రమే ఉన్న ఆర్థిక పరిస్థితిని అధిగమించాలంటే అదనపు నిధులు కేటాయించాలని మేయర్ అముద కోరారు. గురువారం తిరుపతిలో జరిగిన 16వ ఆర్థిక సంఘ సభ్యులు డాక్టర్ సౌమ్యకాంతి ఘోష్, రాష్ట్ర మునిసిపల్ పరిపాలన సంచాలకులు డాక్టర్ ఎస్ సంపత్‌కుమార్, తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల రాష్ట్రస్థాయి సమావేశంలో మేయర్ కూడా పాల్గొన్నారు. అధికారులకు ఆమె వినతిపత్రం ఇచ్చారు. చిత్తూరు కార్పొరేషన్‌లో మౌలిక వసతులు, సదుపాయాలు, బ్యాంకు రుణాలు, విద్యుత్ చార్జీలు చెల్లించడం భారంగా ఉందన్నారు. ఆర్థిక సంఘం విడుదల చేసే నిధులు నిర్దేశించిన పనులకే వినియోగించేలా మార్గదర్శకాలు ఇవ్వాలని కోరారు. వీధి దీపాల నిర్వహణ, నీటి సరఫరా, ఘన వ్యర్థాల నిర్వహణ వ్యయం పెరగడంతో తగిన నిధులు అవసరముందని, చిత్తూరులో సోలార్ ప్లాంటు, నీటి సరఫరాకు అదనపు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

వర్క్ ఆర్డర్ క్లోజ్ చేయకపోతే రిలీవ్ చేస్తా


మాట్లాడుతున్న ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్, పక్కన ఈఈ మునిచంద్ర

- వ్యవసాయ సర్వీసుల ఇవ్వడానికి మీకేం సమస్య?
- ఆగ్రహం వ్యక్తం చేసిన ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్

చిత్తూరు కార్పొరేషన్: పెండింగ్‌లో ఉన్న వర్క్ ఆర్డర్లను క్లోజ్ చేయకపోతే ఏఈలను రిలీవ్ చేస్తానని ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ హెచ్చరించారు. గురువారం చిత్తూరు అర్బన్, రూరల్ డివిజన్ కార్యాలయాల్లో వేర్వేరుగా అధికారులతో సమీక్షించారు. పైపల్లె, ఐరాల, యాదమరి, రెడ్డిగుంట సెక్షన్ల ఏఈలు ఒకొక్కరు రూ.6 కోట్ల మేరకు విలువైన 200 వర్క్ ఆర్డర్లు పెండింగ్‌లో పెట్టుకున్నారని, మెటీరియల్ కొరతతో వ్యవసాయ సర్వీసులు విడుదల చేయలేకపోయామన్నారు. ప్రస్తుతం జిల్లా స్టోర్స్‌లో మెటీరియల్ వచ్చినా క్షేత్రస్థాయిలో సర్వీసుల ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. చిత్తూరు అర్బన్‌లో 900, రూరల్స్‌లో 400, పుంగనూరు డివిజన్‌లో 1900 సర్వీసులు పెండింగ్‌లో ఉన్నాయని ఒకింత మండిపడ్డారు. కార్వేటినగరంలో సర్వీసుల విడుదలలో జాప్యం చేస్తున్నారని, గ్రీవెన్స్‌లో వస్తున్న ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలన్నారు. వేసవిలో విద్యుత్ అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. 11 కేవీ లైన్లను సర్వే చేసి నివేదిక సిద్ధం చేయాలన్నారు. సెక్షన్ల వారీగా లోడ్ మానిటరింగ్ చేసి ఎక్కడెక్కడ ఓవర్‌లోడు ఉందో గుర్తించాలన్నారు. జిల్లాకు ఆరు సబ్‌స్టేషన్లు మంజూరు అయ్యాయన్నారు. చిత్తూరు అర్బన్ డివిజన్‌లో 4, పుంగనూరు డివిజన్‌లో 2 కేటాయించారన్నారు. వీటి కోసం అధికారులు స్థలం చూసి నివేదిక ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఈఈ మునిచంద్ర, సురేష్, ఏఓ ప్రసన్న ఆంజనేయులు, డీఈలు ప్రసాద్, ఆనంద్, కొండయ్య, ఏఈ, సబ్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఒంటరి ఏనుగు హల్‌చల్

–హడలిపోతున్న గ్రామస్తులు


రోడ్డుపై వెళ్తున్న ఒంటరి ఏనుగు

గుడుపల్లె: ఒంటరి ఏనుగు రోడ్డుపై హల్‌చల్ చేసింది. ఈ సంఘటన మండలంలోని సంగనపల్లె నుంచి తమిళనాడులోని వేపనపల్లెకు వెళ్లే రోడ్డులో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. సంగనపల్లె, చిన్నపర్తికుంట, పెద్దపిర్తకుంట గ్రామాల సమీపంలోని ఉన్న రోడ్డుపై ఒంటరి ఏనుగు సంచరించింది. నడిరోడ్డుపై ఏనుగు ఉండడంతో ఆ మార్గంలో వెళ్తున్న వాహనదారులు, మోటార్ సైక్లిస్టులు హడలిపోయారు. ఈ రోడ్డులో నిత్యం ద్విచక్రవాహనాలలో రాకపోకలు సాగిస్తుంటారు. గ్రామాలకు సమీపంలోనే అటవీ ప్రాంతం ఉండడం, దీనికి అనుకుని సాగు చేసిన పంటలు ఉండడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇళ్ల నుంచి రాత్రి పూట వెలుపలికి వచ్చేందుకు జంకుతున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి ఒంటరి ఏనుగు గ్రామాల వైపు రాకుండా కట్టడి చేయాలని కోరుతున్నారు.

ఓవర్ లోడుతో ట్రాన్స్‌ఫార్మర్లు ఢమాల్!

- కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్లు, స్టార్టర్లు, మోటార్లు
- కెపాసిటర్లు పెట్టుకోవాలంటున్న ట్రాన్స్‌కో


మరమ్మతుకు గురైన వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్


ఓవర్‌లోడు కారణంగా కాలిపోయిన స్టార్టర్‌ను రిపేరు చేసుకుంటున్న రైతులు

పలమనేరు: పలమనేరు ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో ఓవర్‌లోడు కారణంగా తరచూ వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. స్టార్టర్లు, మోటార్లు కూడా దెబ్బతింటున్నాయి. వీటిని రీప్లేస్ చేసుకోవడానికి ఇస్తే సకాలంలో రైతులకు మరమ్మతులు చేయడం లేదు. ఫలితంగా పంటలకు నీరందివ్వలేని పరిస్థితి ఉత్పన్నమవుతోంది. ఈ వేసవిలో సమస్య మరింత ఎక్కువైంది. పలమనేరు ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో పలవునేరు, బైరెడ్డిపల్లె, వి.కోట మండలాలున్నాయి. వీటిలో 20 వేల వరకూ విద్యుత్ సర్వీసులున్నాయి. ఈ ప్రాంతంలో ప్రస్తుతం 18 వేల వ్యవసాయ కనెక్షన్లు అవుతున్నాయి. పంటల సాగు కూడా పెరిగింది. ఫలితంగా విద్యుత్ వినియోగం ఎక్కువైంది.

ట్రాన్స్‌ఫార్మర్ల కెపాసిటీ తక్కువ..భారం ఎక్కువ

గతంలో ఒక్కో 15 హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఇద్దరి రైతులకు సంబంధించి రెండు 7.5 హెచ్‌పీ మోటార్లు నడిచేవి. భూగర్భ జలాలు అడుగంటడంతో రైతులు 15 హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్లను 25 హెచ్‌పీగా అప్‌గ్రేడ్ చేయించుకున్నారు. దీంతోపాటే మోటార్, స్టార్టర్ సామర్థ్యాన్ని పెంచుకున్నారు. ప్రస్తుతం పరిస్థితి అలా కాదు. ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలోని రైతులందరూ పెంచిన కెపాసిటీతోనే విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. ఈ కారణంగా భారీగా ఓవర్‌లోడు అవుతుండడంతో తరచూ ట్రాన్స్‌ఫార్మర్లు ట్రిప్ కావడంతో మోటార్లు, స్టార్టర్లు కాలిపోతున్నాయి.

ట్రాన్స్‌ఫార్మర్ల రీప్లేస్‌మెంట్ ఆలస్యం

మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్లను రీప్లేస్‌మెంట్‌కిస్తే కనీసం 15 రోజులులైనా వాటిని సిద్ధం చేయడం లేదు. పెద్దసంఖ్యలో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతుండడం, చాలీచాలని సిబ్బంది వాటిని రిపేరు చేయడం ఆలస్యమవుతోంది. ఫలితంగా పంటలు ఎండుముఖం పడుతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లు కాలితే ట్రాన్స్‌కో సిబ్బంది చేయి తడిపితేగానీ మరమ్మతులు చేయరనే ఆరోపణలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి.

కెపాసిటర్లే ప్రత్యామ్నాయం!

జిల్లాలోని చిత్తూరు, పలమనేరు డివిజన్ల పరిధిలో ఎక్కువగా హై ఓల్టేజ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్) ట్రాన్స్‌ఫార్మర్లు ఎక్కువగా కాలుతుండడంపై ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి పరిశీలించి ఓవర్‌లోడు కారణంగానే ఇవి కాలిపోతున్నట్లు తేల్చారు. దీనికి ప్రత్యామ్నాయంగా కెపాసిటర్లను అమర్చుకోవాలని చెప్పారు. 7.5 హెచ్‌పీ మోటార్‌కు 3–కేవీఆర్ సామర్థ్యం కల ఐఎస్ఐ మార్కు కెపాసిటర్‌ను వాడుకోవాల్సి ఉంది. దీంతో విద్యుత్ వినియోగం తగ్గి అటు ట్రాన్స్‌ఫార్మర్‌కు గానీ ఇటు మోటార్ స్టార్టర్‌లకు ఇబ్బంది లేకుండా ఉంటుందని, వీటిని స్టార్టర్ నుంచి విద్యుత్ సరఫరా మోటార్‌కు వెళ్లే మార్గంలో ఔట్ గోయింగ్ వద్ద అమర్చుకోవాలని అధికారులు చెబుతున్నారు.

జీతాల కోసం ఆందోళన

చిత్తూరు రూరల్(కాణిపాకం): సకాలంలో జీతాలు ఇవ్వడం లేదని గురువారం చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది ఆందోళనకు దిగారు. ప్రతినెలా జీతాల చెల్లింపులో జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. కాంట్రాక్టర్‌కు అప్పగించినప్పటి నుంచి జీతాల్లో ఇబ్బందులు వస్తున్నాయని వాపోయారు.

